క్లుప్తంగా

జిల్లా జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలువురు జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావును కడప జిల్లా ఒకటో అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా ఒకటో అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తున్న కె.శ్రీదేవిని నియమించారు. రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు కం 10వ అదనపు జిల్లా జడ్జి ఎం.నాగేశ్వరరావును విశాఖపట్నం నాలుగో అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో పని చేస్తున్న ఆర్.శ్రీలత నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి యూయూ ప్రసాద్ విశాఖపట్నం ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు ఫ్యామిలీ కోర్టు కం 12వ అదనపు జిల్లా జడ్జి పీవీఎస్ సూర్యనారాయణమూర్తిని నియమించారు. ప్రకాశం జిల్లా ఒకటో అదనపు జిల్లా జడ్జి ఆర్.శివకుమార్‌ను రాజమహేంద్రవరం ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు బదిలీ చేశారు.

సీనియర్ సివిల్ జడ్జిలనూ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జిలలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎంవీఎన్ పద్మజను విశాఖపట్నం ఒకటో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా నియమించారు. ఆమె స్థానంలో ప్రకాశం జిల్లా కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయబాబుని నియమించారు. అలాగే అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజను కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో విశాఖ జిల్లా ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారిని నియమించారు.

మంచినీటి పథకం ప్రారంభం



పార్కులో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సాయిబాబా

బోట్‌క్లబ్: స్థానిక డెయిరీఫారం రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్టీపర్పస్ పార్కులో సుమారు రూ.20 వేలతో ఏర్పాటు చేసిన రక్షిత నీటి పథకాన్ని గురువారం లంక సాయిబాబా ప్రారంభించారు. స్వామి అయ్యప్ప లారీ ట్రాన్స్‌పోర్టు అధినేత సాయిబాబా సౌజన్యంతో ఈ పథకం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పార్కులోకి వచ్చే వారందరి దాహార్తి తీర్చడానికి ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎం.నాగిరెడ్డి, కోశాధికారి శంకర్, సభ్యులు పిల్లి సత్తిబాబు, అమీర్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై అజయ్‌బాబు బుధవారం రాత్రి పలువురిపై కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసుల వివరాలు ఇలా ఉన్నారు. ఈ నెల రెండో తేదీ రాత్రి కాకినాడ అర్బన్ 2వ డివిజన్ ఆర్ఆర్ నగర్‌లో తాను అద్దెకు ఉంటున్న అపార్టుమెంట్ వద్ద తుమ్మలపల్లి నారాయణరావు, కాళ్ల ధనరాజు, గండి కొండలరావు, కోనేటి రామకృష్ణ మరో పది మంది దౌర్జన్యంగా ప్రవేశించి, తనను, తనతో ఉన్నవారిపై అసభ్యంగా దూషించారని జెడ్పీటీసీ రామకృష్ణ ఫిర్యాదు చేశారు. కోనేటి రామకృష్ణ అనే వ్యక్తి భౌతిక దాడి చేసి ఛాతీపై దాడి చేయడంతో భయభ్రాంతులకు గురయ్యామని, తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

7న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలోని రాయ్ చెస్ అకాడమీలో ఈనెల 7వ తేదీన అండర్-17 విభాగంలో జిల్లాస్థాయి బాలుర, బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ ఇన్‌చార్జి ఎం.మనోహర్ గురువారం తెలిపారు. ఈ పోటీలకు 1-1-2007 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు.

ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టాలి

సామర్లకోట: రైల్వే ప్రయాణికుల భద్రతపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి అన్నారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్‌లో భద్రతా అంశాలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైళ్ల వేగం పెరగడంతో ప్రయాణికులు గేట్ల వద్ద ఉండకుండా చూడాలన్నారు. టిక్కెట్ లేని వారిని ప్లాట్‌ఫాంపైకి రాకుండా చూడాలన్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనుమానం ఉన్న ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేసేలా ఆర్పీఎఫ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి రైల్వే స్టేషన్ మేనేజర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్ఎస్ బి.శ్రీధర్, స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్ పాల్గొన్నారు.

తూర్పు సెంటిమెంట్‌గా ఎన్నికల ప్రచారం

- నేమాంలో శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్
- భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- విజయం కోరుతూ సర్వమత ప్రార్థనలు



నేమాంలో ప్రచారం చేపట్టిన కాకినాడ ఎంపీ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, కురసాల కన్నబాబు



నేమాంలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కురసాల కన్నబాబు, సునీల్

కాకినాడ రూరల్: తూర్పు సెంటిమెంట్‌గా మండలంలో నేమాం గ్రామం నుంచి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నుంచి కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కన్నబాబు, కాకినాడ పార్లమెంట్ నుంచి ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ పోటీ చేస్తుండడంతో ఇరువురు నేతలు గురువారం ఉదయం నేమాంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొలుత గ్రామంలోని పురాతన శివాలయం పర్వత వర్ధిని సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రచార వాహనానికి వాహన పూజ అనంతరం అర్చకులు పండిత ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించగా రూరల్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీం బాషా ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలు చేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, కన్నబాబునులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని చర్చి వద్ద క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు దడాల జాషువా గిరి ఆధ్వర్యంలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనం ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రామదేవు సూర్య ప్రకాశరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, కురసాల సత్యనారాయణ, కల్యాణ్ కృష్ణ, అనుసూరి ప్రభాకర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత జమ్మలమడక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని గుర్తు చేస్తూ..

కాకినాడ రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేస్తూ ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్నామని కాకినాడ పార్లమెంట్, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సునీల్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని, అందుకు తమకు విజయం అందించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. టీడీపీ, పొత్తు పార్టీలు వలంటీర్లతో పింఛన్లు పంపిణీకి అడ్డుపడడంతో వృద్ధులు ఎండలో పింఛన్లకు సచివాలయాల వద్దకు వెళ్లి నానా అవస్థలు పడుతున్నారన్నారు. రూరల్ నియోజకవర్గంలో కన్నబాబు చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ అందరి మద్దతు కోరమన్నారు. వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీ సాధిస్తుందన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ నేమాం గ్రామం నుంచి ఏ కార్యక్రమం అయినా ప్రారంభించడం ఆనవాయితీ అన్నారు. నేమాం గ్రామం చాలా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ, పక్కనే ఉన్న పండూరు తదితర చోట్ల సుమారు 15వేల పట్టా స్థలాలను పేదలకు ఇచ్చామన్నారు. ఎంపీ అభ్యర్థిగా సునీల్, ఎమ్మెల్యేగా తాము గెలిచిన తరువాత ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేస్తూ ఓటును అభ్యర్థిస్తామన్నారు.

ఏపీఎస్పీ వద్ద చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ, కమాండెంట్ సతీష్‌కుమార్

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ 3వ బెటాలియన్ క్యాంపు వద్ద చలివేంద్రాన్ని ఎస్పీ, ఏపీఎస్పీ కమాండెంట్ ఎస్.సతీష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కాకినాడ – పిఠాపురంలో మార్గంలో రాకపోకలు సాగించే వారితో పాటు స్థానికులు కోసం దీనిని ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజల దాహార్తి తీర్చేందుకు రెండు నెలల పాటు ఈ చలివేంద్రం కొనసాగుతుందన్నారు. రోజుకు ఒక స్పాన్సర్ ద్వారా మజ్జిగ పంపిణీ ఉంటుందని, దాత వివరాలు చలివేంద్రం వద్ద బోర్డుపై రాస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు సాంబయ్య, సత్యనారాయణ, ఆర్ఐలు సురేష్‌బాబు, రామకృష్ణ, సతీష్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు మరిన్ని పత్రాలకు అనుమతి

- కలెక్టర్ నివాస్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో పలు అంశాలపై సమీక్ష



రాజకీయ పార్టీల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు మరో 12 రకాల డాక్యుమెంట్లను కూడా ఎన్నికల కమిషన్ అనుమతించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఫొటోతో జారీ చేసిన పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగులు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ఉద్యోగులకు ఫొటోలతో జారీ చేసి సర్వీస్ ఐడెంటిటీ కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అఫీషియల్ ఐడెంటిటీ కార్డులు, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వశాఖ జారీ చేసిన యునిక్ డిజెబిలిటీ ఐడీ కార్డులు(యుడీఐడీలలో ఏదేని ఒక డాక్యుమెంట్ ఎపిక్ కార్డుకు ప్రత్యామ్నాయంగా గుర్తింపు కోసం చూపవచ్చని కలెక్టర్ వివరించారు.

14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

కొత్తగా ఓటు నమోదుకు అర్హులైన వారందరూ ఈనెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఎన్నికల కమిషన్ జారీ చేసిన వివిధ నిర్దేశాలను వివరించారు. ఓటరు జాబితాలో ఫారం-6 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ఫారం-8 ద్వారా అడ్రస్ మార్పులు కోరేందుకు ఈ నెల 14 ఆఖరు తేదీగా ఎన్నికల కమిషన్ గడువు నిర్దేశించిందన్నారు. జిల్లాలో కొత్తగా ఓటు హక్కు వయస్సు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్య పరుస్తూ కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. అలాగే అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు పొందేలా రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 5,637 ఫారం-6 దరఖాస్తులతో పాటు ఈనెల 14 నాటికి అందిన దరఖాస్తులను మొత్తం అన్నింటినీ పరిష్కరించి తుది జాబితాలో పొందుపరచనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కోడ్ అమలుపై నిశిత పరిశీలన

ఎన్నికల కోడ్ పటిష్ట అమలును కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నిశితంగా పర్యవేక్షిస్తోందన్నారు. ఇప్పటి వరకు 22 పోర్టల్ గ్రీవెన్స్‌లన్నింటిని పరిష్కరించారన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన 74 ఫిర్యాదులపై రిటర్నింగ్ అధికారులు చర్యలు చేపట్టారన్నారు. అలాగే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వివిధ అనుమతుల కోసం 441 దరఖాస్తులు అందగా 333 అనుమతులు జారీ చేశారని, 70 దరఖాస్తులు తిరస్కరించినట్టు తెలిపారు. మరో 22 దరఖాస్తులు పురోగతిలో ఉండగా 16 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గురువారం నాటికి 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తియ్యిందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, ఎస్.అప్పారావు, రంబాల వెంకటేశ్వరరావు, ఎం.రాజశేఖర్, వి రామ్మోహన్, గదుల సాయిబాబా, ఎన్నికల డీటీ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

లింగ నిష్పత్తి వ్యత్యాసంపై ప్రత్యేక దృష్టి

- ఆర్డీవో ఇట్ల కిశోర్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: లింగ వివక్ష చూపుతూ ఆడ శిశువులపై జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఆయన కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశుసంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డివిజనల్ స్థాయిలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు చేసే పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అలా దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 111 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి, మార్చి రెండు నెలలకు 6 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 95 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. పిండ లింగనిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామస్థాయిలో వైద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతలపై అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అన్ని ప్రభుత్వ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులను వాల్ పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 3365ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.సుజాత, జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.ఇందిరా శ్రీశైలజ, పిడీయాట్రాషియన్ డాక్టర్ ఎం.కీర్తి ప్రియ, వి.వరలక్ష్మి, శివశక్తి ఎన్‌జీవో వి.అనిత, కారుణ్య చారిటబుల్ ట్రస్ట్ ఎన్‌జీవో కె.సింహాద్రి, యూత్ వలంటీర్ ఆర్గనైజేషన్ ఎన్‌జీవో, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎస్.అజయ్, సీడీపీవోలు సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, వి మాధవి, కె.కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్స్ జి.రాంబాబు, కె.గోవింద్, ఎల్.శృతి తదితరలు పాల్గొన్నారు.

కోడ్ కచ్చితంగా అమలుచేయాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆర్వో కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కిశోర్, డీఎస్పీ హనుమంతరావు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అములులో ఉన్నందున రాజకీయ పార్టీలు కోడ్‌ను కచ్చితంగా అనుసరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ కోరారు. సర్పవరం జంక్షన్‌లో ఆర్వో కార్యాలయం వద్ద గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ మోడల్ కోడ్ అములుకు 7 బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ అములుకు 9 బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. కోడ్ అములులోకి వచ్చిన నుంచి రాజకీయ పార్టీల అభ్యర్థులకు 26 అనుమతులు ఇచ్చామన్నారు. సి విజిల్ యాప్ ద్వారా 71 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ముఖ్యంగా 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదుకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో డీఎస్పీ కె.హనుమంతరావు, తహసీల్దార్ విజయ ప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ



మాట్లాడుతున్న వెంకటరావు

కాకినాడ: ఎన్నికల విధులపై ఈ నెల 12, 13 తేదీలలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇవ్వనున్నట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సాయంత్రం సెక్టార్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లతో సమీక్షించారు. శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఎన్నికల విధుల్లో ఉండే పీవో, ఏపీవోలకు ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరుతోపాటు ఇతర ఎన్నికల విధులకు సంబంధించి ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన ఎన్నికల అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, పలువురు సెక్టార్ అధికారులు, నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లు సమావేశంలో పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో విశ్వనాథ బాబ్జిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వివిధ కేసుల్లో పరారీలో ఉన్న మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన కేతా లోవరాజు, బొందలపు రమణ, దుంగా రాజులను అరెస్టు చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చిరంజీవి తెలిపారు.

జాతర ప్రారంభం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు శివారు రంగనాయకపురం గ్రామ దేవత గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

'ఉపాధి' ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించండి

- వేసవి జాగ్రత్తలపై క్లస్టర్ అధికారులతో కలెక్టర్ నివాస్ సమీక్ష

కాకినాడ సిటీ: వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల ఉపాధి కూలీల సంఖ్య తగ్గుతుందని, వేసవిని దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అన్నారు. గురువారం సాయంత్రం ఉపాధి హామీ పథకంపై ఆయా క్లస్టర్ల అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి మేట్ దగ్గర కనీసం 10 ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండాలన్నారు. ఓఆర్ఎస్‌ను ఏ విధంగా ఉపయోగించాలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. పని ప్రదేశంలో టార్పాలిన్, తాటాకు, కొబ్బరి ఆకులతో నీడ సదుపాయాన్ని కల్పించాలన్నారు. మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ సదుపాయం ఉండాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల పనికి వచ్చే మగవారు తెల్లటి దళసరి వస్త్రంతో తలపాగా, ఆడవారు అందరూ తెల్లటి దళసరి వస్త్రంతో తలకు చుట్టుకొని పనికి రావాలన్నారు. వాటర్ కన్సర్వేషన్ (ఇంకుడు గుంతలు) వర్క్సులో భాగంగా ప్రతి మండలానికి ఐదు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌లు, 5 అమృత సరోవర్ ట్యాంకులు చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించి 90 రోజుల పనిదినాలు, కల్పించాల్సిన పనిదినాలు, వారాల వారీగా ప్రోగ్రెస్ పెంచి హౌసింగ్ పని దినాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా రైతులకు పండ్ల తోటల పెంపకం, పూలతోటలు, మునగతోటలు లబ్ధిపై అవగాహన ఇస్తూ అర్హులైన వారందరికీ అవకాశం కల్పించాలన్నారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ మండలానికి ఐదు ప్రభుత్వ సంస్థలను గుర్తించి మొక్కలు నాటాలని సూచించారు. లేబర్ బడ్జెట్ (2024-25) 80 లక్షల పని దినాల్లో మొత్తం 80 శాతాన్ని ఏప్రిల్, మే, జూన్ నెలలో పూర్తి చేయాలని కలెక్టర్ నివాస్ ఆదేశించారు. అందరికీ 100 రోజుల ఉపాధి కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాల వారికి కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ సగటు దినసరి వేతనం రూ. 300 అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, క్లస్టర్ల ఏపీడీలు పి.వసంత మాధవి, పి.జగదాంబ, ఎం.భానుప్రకాష్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

జగ్గంపేట: ప్రస్తుత వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట సీహెచ్‌సీ డాక్టర్ ప్రణీత్ సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు గురువారం వడగాడ్పుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో తిరిగినప్పుడు మగత, వికారం, వాంతులు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే జాగ్రత్తలు పాటించాలన్నారు. నీరు, పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆసుప్రతి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కాకినాడ సిటీ: స్వచ్ఛమైన పర్యావరణాన్ని యథావిధిగా ముందు తరాలకు అందించాలని ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకులు ఎన్. కిశోర్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పర్యావరణ విద్యపై గురువారం రామకృష్ణ పాఠశాలలో అవగాహన కల్పించారు. జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఉన్న ఇకో-క్లబ్ విద్యార్థులకు పర్యావరణ అనే అంశంపై చిత్రలేఖన, వ్యాసరచన, నినాదాలు రాయడంపై పోటీలు నిర్వహిచారు. ఈ పోటీలకు జిల్లాలో ఉన్న 24 పాఠశాలల నుంచి 319 మంది పాల్గొని ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ కేఎస్ఎన్ శర్మ, వీఎల్ గాంధీ, కేవీకే మహేశ్వరరావు, కేసరి శ్రీనివాసరావు, పాల్‌రాజ్ మాట్లాడుతూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో కె అప్పారావు, కె సతీష్, కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్.వీరభద్రరావు, కేవీ చంద్రారెడ్డి, కిరణ్‌కుమారి, డీవీ రమణ, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

వాహనాల తనిఖీలో రూ.2.48 లక్షల సీజ్



స్వాధీనం చేసుకున్న నగదుతో కమిషనర్ రామారావు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వాహనాల తనిఖీలో భాగంగా గురువారం సాయంత్రం సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్స్ సమీపంలో రెండు వాహనాల నుంచి రూ.2.48 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఒక వాహనంలో ఉన్న రూ.లక్ష మరో వాహనంలో రూ.1.48 లక్షలకు ఎటువంటి రసీదులు లేక పోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు తెలిపారు. ఆయన ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఏడీబీ రోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఈ మొత్తం లభించింది. సార్వత్రిక ఎన్నికల నిబంధనలను అనుసరించి రూ.50 వేలకు మించి నగదును తమ వెంట తీసుకొని వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు. పెళ్లిళ్ల బృందాలు, ఆస్పత్రులకు వెళ్లే వారు ఇబ్బంది లేకుండా ఆధారాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి నగదును రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై మూర్తి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, పల్లపు చామవరం రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, డీటీ పీవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. రైతులు రబీలో సాగు చేసిన ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. సాధారణ రకం 75 కిలోల బస్తాకు రూ.1637, గ్రేడ్ ఏ రకం 75 కిలోల బస్తాకు రూ.1652గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని చెప్పారు. ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సీహెచ్ గోపీనాథ్, వీఆర్ఓలు సత్య, శ్రీనివాస్, ఆర్‌బీకే సిబ్బంది మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

కిర్లంపూడి: రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మండల వ్యవసాయాధికారి జోకా అమృత తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఏఏలు, ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.